సాక్షి
వికారాబాద్

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



'ప్రత్యేక' పాలనలో సవాళ్లు!

గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం జనవరి 31తో ముగిసింది. ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలన ప్రారంభమైంది.

8లో▸



మట్టి రోడ్డుతో అవస్థలు

మట్టి రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోకి ఆటోకూడా రాలేని దుస్థితి ఏర్పడింది.

8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
6:36	4:42

న్యూస్‌రీల్

నేడు కొడంగల్‌కు ముఖ్యమంత్రి రాక

కొడంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కొడంగల్‌లో పర్యటించనున్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో మధ్యాహ్నం 2గంటలకు నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం కానున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ సాధించేలా కార్యకర్తలు, నాయకులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. అనంతరం పట్టణంలోని బాలాజీనగర్‌లో కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని సమాచారం.

సమ్మేటివ్ పరీక్షలు వాయిదా

- ఈనెల 15 నుంచి 22వరకు పరీక్షలు
- ఎంఈఓ వెంకటయ్యగౌడ్

తాండూరు రూరల్: ఈ నెల ఎనిమిది నుంచి నిర్వహించాల్సిన సమ్మేటివ్ పరీక్షలు 15 నుంచి 22 వరకు కొనసాగుతాయని ఎంఈఓ వెంకటయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు ఉంటాయని.. ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి 11.45 వరకు, 9వ తరగతగతి విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు పరీక్షలుంటాయని చెప్పారు. ఉగాది, రంజాన్‌తో పాటు ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ ఉండటంతో పరీక్ష సమయాల్లో మార్పులు చేసినట్లు విద్యాశాఖ వెల్లడించింది.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కొత్తూరు: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తనను ఆశీర్వదించి గెలిపించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నందిగామ, కొత్తూరు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలతో పాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలను వర్తింపచేస్తామన్నారు. ఎన్నికల తర్వాత నిరుద్యోగులకు ఆర్థిక సాయంతో పాటు ఏకకాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధిహామీ తరపున కూలీలకు రోజుకు రూ.400 కూలీతో పాటు ఎక్కువ రోజులు పని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల తర్వాత అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక తమ ఉనికిని కాపాడుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీ లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు విమర్శించారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఎమ్మెల్యేగా, ఇతర పదవుల్లో ఉండి కూడా ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్రస్తుత బీఆర్ఎస్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి గెలిచిన తర్వాత ప్రజలను మర్చిపోయారన్నారు. అనంతరం చౌదరిగూడతో పాటు కొత్తూరు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాం సుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో ప్రయాణికులకు షాక్

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ షాక్ ఇచ్చింది. కూల్ జర్నీపై ఆంక్షలు విధించింది. పర్యాటకులను, నగరవాసులను విశేషంగా ఆకట్టుకున్న హాలిడే పాస్‌ను ఎత్తేసింది. కేవలం రూ.59కే లభించే హాలిడే పాస్‌తో ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేసే అవకాశం ఉండేది. రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉండేది. దీంతో ఆ రోజుల్లో లక్షలాది మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మార్చి 31 నుంచి హాలిడే పాస్ పథకాన్ని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రోజువారీ ప్రయాణాలపై లభించే 10 శాతం రాయితీని కూడా నిలిపివేశారు. ఇప్పటి వరకు సుమారు 30 వేల మందికి పైగా విద్యార్థులు వినియోగించుకుంటున్న స్టూడెంట్ పాస్‌ల గడువు ఈ ఏప్రిల్ నెలాఖరుతో ముగియనుంది. ఈ పాస్‌ను తీసుకున్న విద్యార్థులు 20 ట్రిప్పులకు చార్జీలు చెల్లించి మరో 10 ట్రిప్పులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. కొత్త ఆర్థిక సంవత్సరం ఆదాయ వ్యయాలను అంచనా వేసేందుకే ఈ పథకాలను నిలిపివేసినట్లు సమాచారం.



వంద సంవత్సరాల చరిత్ర కలిగిన వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

వందేళ్ల సేవలకు సెలవు

వికారాబాద్ ఏరియా ఆస్పత్రి ఇక గతం..

స్వాతంత్ర్యానికి పూర్వం ప్రారంభమై.. కోట్లాది మంది ప్రజలకు వందేళ్ల పాటు వైద్య సేవలందించి.. ఎంతో మంది వైద్యులు, వైద్య సిబ్బందికి పని కల్పించిన వికారాబాద్ ఏరియా ఆస్పత్రి ఇక సెలవు తీసుకోనుంది.. నాలుగు గదులు, ఒక డాక్టర్‌తో ప్రారంభమైన ప్రస్థానం.. దినదినాభివృద్ధి చెందుతూ వంద పడకల ఆస్పత్రిగా రూపాంతరం చెందింది.. గత ఏడాది జనరల్ ఆస్పత్రి మంజూరు కావడంతో తన సేవలకు స్వస్తి పలకనుంది.

- ఇప్పటికే సిబ్బంది తరలింపు మరూ..
- జనరల్ ఆస్పత్రికి మరో చోట భవన నిర్మాణం
- ఇన్నాళ్లు వైద్య విధాన పరిషత్ కింద..
- ఇప్పుడు మెడికల్ ఎడ్యుకేషన్‌కు మార్పు

వికారాబాద్: వందేళ్లుగా వైద్య సేవలందించిన వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి.. తన సేవలకు సెలవు ప్రకటించనుంది. నిజాం ప్రభుత్వ కాలంలో స్వాతంత్ర్యానికి ముందు నాలుగు గదులు.. ఆరు బెడ్లు.. ఓ వైద్యుడు.. ఓ నర్సు.. మరో కాంపౌండర్‌తో ప్రారంభించిన ఈ ఆస్పత్రి కాలక్రమేణా ఎన్నో మార్పు లకు లోనవుతూ వచ్చింది. వందేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి ఇంతింతై వటుడింతై అన్నట్లుగా దినదినాభివృద్ధి చెందుతూ వంద బెడ్లు.. 50 మందికి పైగా సిబ్బందితో సేవలందించే స్థాయికి చేరింది. గతేడాది కొత్తగా వికారాబాద్‌కు మెడికల్ కళాశాల మంజూరు కావడంతో దానికి అనుబంధంగా జనరల్ ఆస్పత్రి సైతం ఏర్పాటు చేశారు. దీంతో ఒక్కొక్కటిగా మార్పులు చేస్తూ వెళుతున్నారు. ఇప్పటి వరకు ఏరియా ఆస్పత్రి వంద బెడ్లతో వైద్యవిధాన పరిషత్ కింద పని చేయగా.. ఇప్పుడు కొత్తగా నిర్మించే జనరల్ ఆస్పత్రి వైద్య విద్య(మెడికల్ ఎడ్యుకేషన్) కింద సేవలందించనుంది. దీంతో ఆస్పత్రి భవనంతో పాటు అక్కడ ఇన్నాళ్లు విధులు నిర్వహిస్తూ వచ్చిన వైద్యులు, సిబ్బందిని సైతం మరో చోటికి మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా అక్కడ విధులు నిర్వహించిన వైద్యులు, సిబ్బందిని మార్చగా ఇక ఆస్పత్రి పేరు ఒక్కటే మార్చాల్సి ఉంది. ఈ ప్రక్రియను కూడా వారం పది రోజుల్లో పూర్తిచేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

1920లో సేవలు ప్రారంభం

వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని 1920లో సర్కారు దవాఖాన పేరుతో అప్పటి నిజాం ప్రభుత్వం ప్రారంభించింది. స్వాతంత్ర్య అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయింది. 1960లో ఇక్కడ మొదటి సారిగా కాన్పులు చేసేందుకు వీలుగా ప్రసూతి గదిని, మహిళా వైద్య నిపుణులను నియమించారు. అనంతరం సివిల్ ఆస్పత్రిగా, సీహెచ్‌సీ (కమ్యునిటీ హెల్త్ సెంటర్), ఏరియా ఆస్పత్రిగా రూపాంతరం చెందింది. ఆరు పడకలతో ప్రారంభమైన దవాఖానా దశల వారీగా వంద బెడ్లకు చేరుకుంది. గత ఏడాది సెప్టెంబర్ 30న జనరల్ ఆస్పత్రి మంజూరయ్యే నాటికి 50మందికి పైగా వైద్య సిబ్బంది, వంద బెడ్లతో సేవలందిస్తూ వచ్చింది.

జనరల్ ఆస్పత్రిగా..

గతేడాది వికారాబాద్‌కు మెడికల్ కళాశాల మంజూరైన విషయం తెలిసిందే. ప్రస్తుత విద్యా సంవత్సరంలో వంద సీట్ల సామర్థ్యంతో మెడికల్ కళాశాల తరగతులను ప్రారంభించారు. గత ప్రభుత్వం రూ.240 కోట్లతో మెడికల్ కళాశాలను మంజూరు చేయగా ఇందులో మెడికల్ కళాశాల తోపాటు అనుబంధంగా 330 పడకల సామర్థ్యంతో జనరల్ ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నారు. రూ.30 కోట్లతో ఎస్ఏపీ కళాశాల ఎదురుగా ఆస్పత్రి కోసం తాత్కాలిక భవనాన్ని నిర్మిస్తున్నారు. అనంతగిరి గుట్టపై టీబీ శానిటోరియం ఆవరణలో నిర్మించిన తాత్కాలిక భవనంలో మెడికల్ కళాశాల తరగతులు కొనసాగుతున్నాయి. అనంతగిరికి వెళ్లే దారిలో బిల్ల దాఖలా ఏరియాలో మెడికల్ కళాశాలకు నూతన భవనం నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలో కొత్త భవనంలోకి..



ప్రస్తుతం 86 మంది వైద్యులు, 203 మంది వైద్య సిబ్బందితో పాత భవనంలోనే జనరల్ ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. తాత్కాలిక భవనం అందుబాటులోకి వచ్చిన వెంటనే అక్కడికి మారుస్తాం.

– డాక్టర్ రాంచంద్రయ్య, సూపరింటెండెంట్ జనరల్ ఆస్పత్రి, వికారాబాద్



శ్రీవారి వాహన సేవలో చిన్నారులు

బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం

కొడంగల్‌లోని పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామి వారు శ్రీకృష్ణుడి అవతారంలో కల్పవృక్షంపై మాఢ వీధుల్లో ఊరేగారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యనిర్వాహక అధికారి లోకనాథం, టీటీడీ డిప్యూటీ ఈఓ ప్రత్యేక పూజలు నిర్వహించి.. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. – కొడంగల్



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న అధికారులు

ఉద్యమ కళాకారులను గుర్తించాలి

అరుణోదయ విమలక్క

బొంరాస్‌పేట: ఉద్యమ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకురాలు విమలక్క అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కళాకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన కళాకారులను విస్మరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కళాకారులకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రేగడిమైలారంలో ఉద్యమ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

మరో ఉద్యమం

నీళ్లు, నిధులు, నియామకాల కోసం మరో ఉద్యమం ప్రారంభిస్తామని విమలక్క అన్నారు. కాగ్నా నదినీళ్లను కొడంగల్ ప్రాంతానికి పారించాలని డిమాండ్ చేశారు. సాగునీరందించే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రకటించారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవిందనాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, అరుణ్‌నాయక్, శ్రీనివాస్, వెంకట్, శంకర్, చెన్నప్ప, పరమేశ్వర్, రాములు, అనిత, శ్రీశైలం తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పదేళ్లలో చేసిందేమీ లేదు

- రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట వేల కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఓఆర్ఆర్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, శంకర్‌పరిధిలోని ఐఐటీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని.. కొత్తగా కేసీఆర్ పాలన చేసిందేమీ లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

నేడు సీఎం రాక!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం పట్టణంలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే చెప్పారు. ఎంపీ రంజిత్‌రెడ్డి గెలుపుకోసం కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. మీ సమావేశానికి ఆయా గ్రామాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయంతంవం చేయాలని పిలుపునిచ్చారు.

గ్యారంటీల పేరిట మోసం

- కాంగ్రెస్ హామీలను ప్రజలు విశ్వసించడం లేదు
- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ధారూరు: ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు: కాంగ్రెస్ ప్రభుత్వ వాగ్దానాలను ప్రజలు విశ్వసించడం లేదని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని మున్నూరుసోమారం, గడ్డమీది గంగారం, మోమిన్ కలాన్, నాగారం, ధారూరు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుతో ప్రజల్ని చెంపదెబ్బ కొట్టిందని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజల్ని మోసం చేసిందని ఆరోపించారు. గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో కాంగ్రెస్ పెంచుతామని చెప్పిన పెన్షన్ డబ్బులు పెంచలేదని వాపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలోని గ్రామాలకు రోడ్లు వేయిస్తామని అన్నారు. దేశంలో ప్రధానికి పోటీయే లేదని.. ప్రతిపక్ష పార్టీలు సైతం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తోందని చెబుతున్నారంటే మోదీకి ఎంత ఆదరణను అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా అందరికి రా లేదని ఆయన ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, కరెంట్ కోతలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, ఉచిత రేషన్‌బియ్యం, మరుగుదొడ్ల నిర్మాణం, కూలీలకు ఉపాధి కేంద్ర ప్రభుత్వ నిధులేనని వివరించారు. బీజేపీ అభ్యర్థులు గెలిస్తేనే కేంద్రం నుంచి అధిక నిధులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా మహిళ అధ్యక్షురాలు యాస్కి శిరీష, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.రమేష్, బీజేపీ మాజీ ఎంపీపీ ఉమాపార్వతి, మండల నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, రాజు నాయక్, రాజేందర్‌గౌడ్, కేపీ రాజు, భాస్కర్‌రెడ్డి, అనిల్‌గౌడ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశం మోదీ పాలన కోరుకుటోంది

అనంతగిరి: బీదేశమంతా మోదీ పాలననే కోరుకుంటోందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వికారాబాద్ మండల పరిధిలోని పీలారం, రాళ్లచిట్టంపల్లి, ద్యాచారం, గొట్టిముక్కుల, కామరెడ్డిగూడ, పాతూర్, సిద్దులూర్ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో నరేంద్రమోదీ మూడో సారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ పరిధిలో ఎక్కడ చూసినా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులే కనిపిస్తున్నాయన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తూ దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ప్రపంచమంతా మోదీ పాలనను ప్రశంసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు శివరాజు, పాండుగౌడ్, కేపీ రాజు, జిల్లా నాయకులు విజయబాస్కర్, రాజేందర్‌రెడ్డి, సతీశ్, శ్రీకాంత్, నందు, రాములు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ' కమిటీలతో పాఠశాలల అభివృద్ధి

- ఆదర్శ పాఠశాలల కమిటీలు త్వరగా వేయండి
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

పరిగి: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతోనే పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని.. పాఠశాల సదుపాయాలు, సమస్యల పరిష్కారం ఈ కమిటీ అధ్వర్యంలోనే జరుగుతాయని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. ఆదివారం ఆమె పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు నిర్వహిస్తూ.. మున్సిపాలిటీలో మెప్మా వారి సహకారంతో కమిటీలు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఈ కమిటీలో మొత్తం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతుందన్నారు. చైర్‌పర్సన్‌గా గ్రామ మహిళా సమాఖ్య వారు, కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయులు ఉంటారని ఇద్దరితో జాయింట్ ఖతాలు తెరవాలని సూచించారు. ప్రతి ఒక్క పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేసి ఖాతాలను తెరవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, మున్సిపల్ అధికారులు, మండల పరిషత్ అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు బీమా తప్పనిసరి

- ఈ నెల 15లోగా వివరాలివ్వాలి
- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి

తాండూరు టౌన్: జర్నలిస్టులంతా విధిగా బీమా చేయించుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి అన్నారు. ఆదివారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తాండూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం వార్తల సేకరణలో ప్రయాణం చేసే జర్నలిస్టులకు ప్రమాదాలు పొంచి ఉంటాయన్నారు. ప్రతీ జర్నలిస్టు విధిగా బీమా చేయించుకుని ఉంటే.. ఎలాంటి పరిస్థితుల్లో అయినా వారి కుటుంబానికి ఆసరాగా ఉంటుందన్నారు. యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులందరికీ బీమా చేయించాలని నిర్ణయించామన్నారు. పోస్టాఫీసులో పలు రకాల బీమా పథకాలున్నాయని, ఎవరైనా ప్రమాదానికి గురై మృతి చెందితే రూ.10 లక్షల బీమా వర్తించే అవకాశం ఉందన్నారు. గాయాల పాలైనప్పటికీ అందుకు సంబంధించిన నగదును బీమా పథకం ద్వారా పొందవచ్చన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 15లోగా పోస్టాఫీసులో ఖాతా తెరిచేందుకు జర్నలిస్టులందరూ సంబంధిత బాధ్యులకు మీ వివరాలు ఇవ్వాలని సూచిచారు. అర్హులైన జర్నలిస్టులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్ రెడ్డి, సాక్షి రామకృష్ణ మాట్లాడుతూ.. తాండూరులో ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం కృషి చేస్తామని, తాత్కాలికంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మండల పరిధి కామునిపల్లి మాజీ సర్పంచ్ బాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న కొప్పుల.. ఆదివారం ఆయనను పరామర్శించారు. అనంతరం మాట్లాడారు. ఎవరికి ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆందోళన చెందవద్దని, తాము అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రైతుబంధు మాజీ అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ మైపాల్ రెడ్డి, నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం'



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 70లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు ఒక్కసీటు ఇవ్వని కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జగ్జీవన్‌రాం చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని అవలంభిస్తుందని మండిపడ్డారు. 12శాతం ఉన్న మాదిగలకు పార్లమెంటు ఎన్నికల్లో అవకాశం కల్పించకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పునరాలోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవి, ప్రకాష్, శివాజీ, శ్రీశైలం, మోహన్ , బాబు, సూర్యప్రకాష్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నూతన కమిటీ సభ్యులు

అనంతగిరి: తైక్వాండో జిల్లా అసోసియేషన్ చైర్మన్‌గా రాఘవన్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం వికారాబాద్‌లో నిర్వహించిన తైక్వాండో ముఖ్య ప్రతినిధుల సమావేశంలో అధ్యక్షుడిగా కృష్ణ, కార్యదర్శిగా గోపాలకృష్ణ, కోశాధికారిగా రవి, తదితరులను నియమించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

వికారాబాద్ స్టేషన్ పరిధిలో ఘటన

అనంతగిరి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణం రామయ్యగూడకు చెందిన మనోహర్ (20) పశువులు మేపుతూ జీవనం కొనసాగిస్తుండేవాడు. కాగా ఈ మధ్య పశుపోషణతో పాటు కూలీపనులు చేయడం ప్రారంభించాడు. శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిన మనోహర్ ఆదివారం ఉదయం 7గంటల సమయంలో రైల్వే గేట్ సమీపంలో ఆత్యహత్య చేసుకున్నాడని స్థానికులు సమాచారం ఇవ్వగా వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి మనోహర్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శంకరయ్య తెలిపారు.

కండక్టర్‌పై చేయి చేసుకున్న యువకుడు

కేసు నమోదు చేసిన పోలీసులు

ధారూరు: వికారాబాద్ నుంచి తాండూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కిన ఓ ప్రయాణికుడు.. టికెట్ తీసుకోకుండా కండక్టర్‌పై చేయి చేసుకున్న సంఘటన ఆదివారం మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండల కేంద్రానికి చెందిన పోటరీ శ్రీశైలం.. మద్యం మత్తులో బస్సు ఎక్కాడు. కండక్టర్ కిషోర్‌టికెట్ తీసుకోవాలని కోరగా.. బూతులు తిట్టాడు. తోటి ప్రయాణికులు వారించినా వినకుండా.. కండక్టర్‌ను కొట్టి, గాయపర్చాడు. దీంతో డ్రైవర్ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించాడు. జరిగిన సంఘటనపై కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.



కల్పవృక్ష వాహనంపై స్వామివారు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు

శ్రీవారికి శేష వస్త్రాల సమర్పణ

కొడంగల్: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీకృష్ణ పరమాత్మ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మూర్తిని కల్పవృక్ష వాహనంలో పలు రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీవారి ఆలయంలో పద్మావతి సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి మూలమూర్తికి విశేష పూలతో అలంకరణ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి విశేష ఆరాధనలు చేశారు. శ్రీవారిని కల్పవృక్ష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించగా.. గోవింద నామ స్మరణలతో పురవీధులు మారుమోగాయి. మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకం జరిపించారు. శనివారం రాత్రి వ్యాళి వాహనంపై స్వామివారిని ప్రతిష్ఠించి మాడ వీదుల్లో ఊరేగించారు.

ఏటా తిరుమల నుంచి..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్డీ వేముల శ్రీనివాస్, టీటీడీ డిప్యూటీ కార్యనిర్వాహణాధికారి లోకనాథంలు స్వామివారికి శేష వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఏటా తిరుమల నుంచి శేష వస్త్రాలను తెచ్చి, శ్రీవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మోదీతోనే అవినీతిరహిత పాలన



చాపలగూడెంలో ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

- బీజేపీకి మద్దతు ఇద్దాం.. దేశాభివృద్ధికి బాటలు వేద్దాం
- ఇంటింటి ప్రచారంలో కొండా సోదరి మీరారెడ్డి, బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: మోదీతోనే అవినీతిరహిత పాలన అని, బీజేపీకి మద్దతుగా నిలిచి, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి మీరారెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి చాపలగూడెం, తిర్మలాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీకి అండగా నిలిచి, మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేసే కొండాకు లోక్‌సభ ఎన్నికల్లో ఓటువేసి గెలిపించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఏ గ్రామానికి వెళ్లినా యువత మోదీ నాయకత్వాన్ని కోరుకుంటుందని, ఇది ఎంతో ఆనందించదగిన అంశమని పేర్కొన్నారు. అవకాశవాద రాజకీయాలు చేసే వ్యక్తుల మాటలు నమ్మవద్దని సూచించారు. వారు ఇచ్చే డబ్బులు, మోసపూరిత వాగ్దానాలు తాత్కాలికమని, ఈ ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కొండా చిన్నమ్మ కల్పనారెడ్డి, రాంచంద్రయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎన్నికల మేనిఫెస్టో ప్రతినిధి టి. కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దివ్యాంగులకు ప్రతి నెల రూ.6 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని, చట్టసభల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దివ్యాంగులపై జరుగుతున్న అఘాయిత్యాలపై విచారణకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌డి కోకన్వీనర్లు వి.భారతి, కాటమోని వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



గంగభాయ్(ఫైల్)

తాండూరు రూరల్: జీవితంపై విరక్తిచెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ అంగన్‌వాడీ టీచర్, చికిత్సపొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధి జినుగుర్తితండాలో ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు మండలం జినుగుర్తితండాకు చెందిన గంగభాయ్(36) అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోంది. భర్త సురేష్ కొంత కాలం క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో గంగ కల్లుతాగిన మత్తులో గత సోమవారం రాత్రి పురుగు మందు సేవించింది. గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరిశీలించిన వైద్యులు.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీకి తరలించాలని సూచించారు. అనంతరం శనివారం మరోసారి జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందారు. మృతురాలి తల్లి జాలిభాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తన కూతురి మృతిపై ఎలాంటి అనుమానం జాలి ఫిర్యాదులో పేర్కొంది.



ఉపవాస దీక్షలను విరమిస్తున్న ముస్లింలు

పైలట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

తాండూరు: రంజాన్ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందుకు వందలాది మంది ముస్లింలు హాజరై.. ఉపవాస దీక్ష విరమించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ చెవేళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్, రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీం, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాసచారీ, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విందుకు హాజరైన కాసాని, తదితర నాయకులు

కష్టపడితే బంగారు భవిష్యత్తు



ఫలితాలను విడుదల చేస్తున్న డాక్టర్ సాత్వికారెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఉన్నత విద్యలో కష్టపడి చదివితే మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటారని చైతన్య డీమ్డ్ టూబీ విశ్వవిద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి హిమాయత్‌నగర్‌లోని చైతన్య యూనివర్సిటీ బీటెక్ తదితర కోర్సుల మొదటి సంవత్సరం ఫలితాలను సాత్వికరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ, బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ అగ్రికల్చర్ తదితర వాటిల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్రమశిక్షణ అలవర్చుకుంటే విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించగలుగుతారని విద్యార్థులను ఉద్దేశించి చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య జగదీశ్వర్, అడ్మినిస్ట్రేట్ డీన్ రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు పాల్గొన్నారు.

సర్వమతాల సమూహమే కాంగ్రెస్ పార్టీ

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సర్వమతాల సమూహమే కాంగ్రెస్ పార్టీ అని, అన్ని మతాలను గౌరవించే లౌకిక పార్టీ అందరికీ అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు పార్టీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ లౌకిక పార్టీ అని, కులం, మతం పేరుతో రాజకీయాలు చేయబోదన్నారు. భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పండగ రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్రవంతి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మహమ్మద్ గౌస్, డాక్టర్ సంజీవ్ కుమార్, రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ బర్ల మంగ, ఆకుల నందు, కృష్ణ, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో గొడవ

ఇరువర్గాలపై కేసు నమోదు


అనంతగిరి: తాగిన మైకంలో జరిగిన గొడవ కారణంగా వికారాబాద్ పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాలు.. మున్సిపల్ పరిధిలోని దన్నారం తండాలో ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో మరొకరు తాగిన మైకంలో దురుసుగా ప్రవర్తించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగి ఇరువర్గాలు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో వారికి స్వల్ప గాయాలు కాగా వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోందు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'ప్రత్యేక' పాలనలో పెను సవాళ్లు!

- అధికారులకు తప్పనితిప్పలు
- నిధులు లేక కుంటు పడుతున్న అభివృద్ధి పనులు



చెరువు దగ్గర తాగునీటి బోరు మరమ్మతు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి



తాగునీటి పైప్‌లైన్ పనులు

దౌల్తాబాద్: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం జనవరి 31తో ముగిసింది. అనంతరం ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలన ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వం మండలంలోని 33 పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా మండల స్థాయి అధికారులను నియమించింది. అయితే బాధ్యతలు చేపట్టిన వారికి.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పెను సవాలుగా మారుతున్నాయి. వీటికి తోడు పంచాయతీల్లో నిధుల కొరత, వాహనాల నిర్వహణ తలకుమించిన భారమవుతోంది.

ఖర్చులతో కుస్తీ

పల్లెల్లో పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరియాలనే ఆలోచనతో ప్రభుత్వం పంచాయతీకో ట్రాక్టర్, ట్యాంకర్‌ను ఈఎంఐ పద్ధతిన కొనుగోలు చేసింది. సర్పంచ్‌లు వాటికి నెలవారీగా కిస్తులు కడుతూనే, వాటి నిర్వహణ కొనసాగించారు. ప్రస్తుతం ఆ నిర్వహణ బాధ్యత ప్రత్యేకాధికారులపై పడటంతో తర్జనభర్జన పడుతున్నారు. చిన్న జీపీల్లో వాయిదాలు, డీజిల్ ఖర్చులతో కుస్తీ పట్టే పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాక్టర్ల నిర్వహణ పంచాయతీలకు తలకుమించిన భారంగా మారింది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు సక్రమంగా అందటం లేదన్నట్లు సమాచారం.

భవనాల కొరత

అనేక నూతన పంచాయతీల్లో సొంత భవనాలు లేవు. కొన్ని చోట్ల అసంపూర్తి పనులతో దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు నిధులు విడుదల చేస్తే కానీ.. అవి పూర్తయ్యే పరిస్థితి లేదు. కొన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది.

పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏమిటి?

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైకుంఠధామాలు, పల్లె ప్రకతివనాలు, సీసీరోడ్లు, డ్రైనేజీల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. తమకు రావాల్సిన బిల్లుల గురించి ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్తులో యువత చిత్తు

మాదక ద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతోంది. దురలవాట్లకు చేరువై జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియని దుస్థితికి చేరుకుంటున్నారు. తప్పని వారించిన వారిని.. చంపడానికైనా, లేదా తాను చావడానికైనా వెనకాడటం లేదు. ఇటీవల జిల్లాలో ఇదే జరిగింది. డ్రగ్స్‌కు అలవాటు పడి కన్న తండ్రినే అంతమొందించిన సంఘటన కలకలం రేపింది.

- నగర శివారులోజోరుగా వ్యాపారం
- ఇష్టారాజ్యంగా మాదక ద్రవ్యాల క్రయవిక్రయాలు
- విద్యార్థులు, వలస కూలీలే టార్గెట్
- పార్టీల పేరుతో రిసార్ట్స్, ఫాంహౌసుల్లో వినియోగం
- పెరుగుతున్న క్రిమినల్ దుశ్చర్యలు



ఆదిబట్ల ఠాణా పరిధిలో గంజాయితో పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: పట్నం నుంచి డ్రగ్ కల్చర్ పల్లెకు పాకింది. ఒకప్పుడు నగరాలకే పరిమితంగా ఉండేంది. విదేశాల నుంచి లేదంటే ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యేది. పబ్బుల కేంద్రంగా గుట్టుగా వ్యవహారం కొనసాగేది. పోలీసుల సోదాలు విస్తృతం కావడంతో.. డ్రగ్స్ వ్యాపారులు పల్లెలను సురక్షిత ప్రాంతాలుగా ఎంచుకున్నారు. రంగారెడ్డి జిల్లాకు రాజధాని హైదరాబాద్ సమీపాన ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు గంజాయి, కొకైన్, యాష్ ఆయిల్ తదితర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ.. విద్యార్థులను బానిసలుగా మారుస్తున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ తదితర ప్రాంతాలను కేంద్రాలుగా మార్చుకున్నారు. అక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రాము రూ.100, 200లకే లభ్యం అవుతుండటంతో రెండు పదుల వయసు నిండని వారు సైతం మత్తుకు బానిసవుతున్నారు.

మత్తులో అఘాయిత్యాలు

జిల్లాలోని మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ జిల్లాలో కీసర, ఘట్కేసర్ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కళాశాలలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ విదేశీ విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. స్వదేశీ యువత వారిదారిలోనే పయనిస్తోంది. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. అదే విధంగా బహుళజాతి కంపెనీలు రావడం, ఇటుక బట్టీలు తదితర పరిశ్రమలు కొలువుదీరగా.. వాటిల్లో పని చేసే కార్మికులు ఒడిస్సా, బిహార్, చత్తీస్‌ఘడ్, బెంగాళ్ ప్రాంతాలకు చెందిన వారే అధికంగా ఉండటంతో వీరికి డ్రగ్స్‌ను ఎరవేస్తున్నారు. ఇలా మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు, ఆడవారిపై అఘాయిత్యాలు, అకారణంగా గొడవలకు దిగడంతో పాటు హత్యలు చేయడానికి సైతం వెనకాడటం లేదు.

మద్యంతో పాటు గంజాయి

రాజధానికి సమీపాన ఉన్న ఇబ్రహీంపట్నం, శంకర్‌పల్లి, మంచాల, యాచారం, మొయినాబాద్ లాంటి ప్రాంతాల్లో రిసార్టులు, క్లబ్‌లు, ఫాంహౌస్‌లు విపరీతంగా పెరిగిపోయాయి. వీటిల్లో ఇక్కడి యువతతో పాటు, పొరుగు రాష్ట్రాల వారు రకరకాల పార్టీ(దావత్)లు చేసుకుంటారు. విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతూ ఎంజాయ్ చేస్తుంటారు. దీంతో క్రమంగా డ్రగ్ కల్చర్ పల్లె ప్రాంతాలకు చేరువయింది. మద్యంతో పాటు గంజాయి, కొకైన్, హుక్కా విచ్చలవిడిగా సేవించడం అలవాటుగా మార్చుకున్నారు.

ఉక్కుపాదం మోపుతున్నాం



డ్రగ్స్ కల్చర్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, యాచారం ప్రాంతాల్లో పలు రకాల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాం. చాలా కేసులు నమోదు చేశాం. డ్రగ్స్ క్రయవిక్రయాలు నేరం. కఠిన శిక్షలు ఉంటాయి. పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. ఇలాంటి కేసుల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదు. యువత వ్యసనాలకు బానిస కావొద్దు. జీవితాలను చీకటిమయం చేసుకోవద్దు. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయవద్దు.

– కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ

అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీ, బిడ్డ క్షేమం



నవజాత శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

షాద్‌నగర్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణిని కాన్పుకోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామ మండలం చేగూరు గ్రామానికి చెందిన గునగంటి కల్పనను పురుడు కోసం ఆమె కుటుంబ సభ్యులు షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. గర్భిణిని పరీక్షించిన వైద్యులు.. ప్రసవం కోసం హైదరాబాద్ పేట్ల బుర్జుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆమెను అంబులెన్స్‌లో నగరానికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బందిలో ఒకరైన అత్యవసర వైద్య నిపుణుడు సత్యనారాయణ, పైలెట్ మహబూబ్ సహాయంతో పురుడు పోశారు. ఆ ఇల్లాలు మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు.